

వినియోగం చారెడు.. బిల్లు బారెడు

-స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ -4 యూనిట్లకు రూ. 362 కరెంటు బిల్లు..!
-5న విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అధికార ప్రతిపక్ష పార్టీలు, కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ఆదాని దోపిడీ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారని వినియోగదారులు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడం వెంటనే నిలుపుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కోరారు. సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలు, సామాన్య పేద ప్రజలపై పడే భారాలను తెలియజేస్తూ వార్డులలో ప్రజలను చైతన్య పరుస్తూ వివరిస్తూ సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ,సంతకాల సేకరణల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అయినా పాలకుల నుంచి స్పందన లేదు. మరోసారి పాలకులకు, అధికారులకు తెలిసేలా ఈనెల 5న విద్యుత్ భవన్ ముందు, డివిజన్ కార్యాలయంలో వద్ద ధర్నా చేయనున్నారు. వినియోగదారుడు వినియోగించిన యూనిట్ల చార్జికంటే కంటే 10 రెట్లు అనవసన ఛార్జీల భారం మోపి వినియోగదారుల నడ్డివిరుస్తున్నారు. వినియోగం చారెడు...బిల్లు బారెడు అన్న చందందా పరిస్థితి ఎంది. ఈ క్రింది బిల్లులను పరిశీలిస్తే అసలు విషయం తేటతెల్లమవుతుంది.

1.సర్వీసు నెంబర్: 8311301055755 వాడిన యూనిట్లు04, మినిమం /ఎనర్జీ చార్జి రూ.07.60, పిక్చర్ చార్జి రూ.30.00, కస్టమర్ ఛార్జ్/వినియోగదారుడు కరెంట్ వాడుకున్నందుకు ఛార్జ్ రూ. 25.00, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ .0.24, ఇంట్రెస్ట్ ఆన్ డ్యూటీ రూ.0.01. , సర్ ఛార్జ్ రూ.25.00, గ్రిడ్ ఛార్జి, షార్ట్ ఫాల్ ఛార్జ్, అదర్ చార్జెస్, అడ్జెస్ట్ మెంట్ చార్జెస్, ట్రూ ఆఫ్ చార్జెస్ రూ.42.23, ఎఫ్‌పిపిసిఎ (ఫెయిల్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జెస్ట్ మెంట్ చార్జెస్ రూ.241.43, లాస్/గెయిన్ చార్జెస్, గవర్నమెంట్ సబ్సిడీ చార్జెస్, అరియర్స్ చార్జెస్, అసలు బిల్లు **మొత్తం:** రూ.362.06.

సర్విస్‌నెంబర్ 8311301055754 : వినియోగించిన యూనిట్లు14, మినిమం ఎనర్జీ చార్జి రూ.26.60. పిక్చర్ చార్జి రూ.20.00, వినియోగదారుడు కరెంట్ వాడుకున్నందుకు ఛార్జ్ రూ.25.00, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.0.84, ఇంట్రెస్ట్ ఆన్ డ్యూటీ రూ.0.01, సర్ ఛార్జ్ రూ.25.00, గ్రిడ్ ఛార్జి, షార్ట్ ఫాల్ ఛార్జ్, ఆధర్ చార్జెస్, అడ్జెస్ట్ మెంట్ చార్జెస్, ట్రూ ఆఫ్ చార్జెస్ రూ. 270.76, ఎఫ్‌పిపిసిఎ(ఫెయిల్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జెస్ట్ మెంట్) చార్జెస్ రూ.423.63, లాస్/గెయిన్ చార్జెస్ గవర్నమెంట్ సబ్సిడీ చార్జెస్, అరియర్స్ చార్జెస్ అసలు బిల్లు మొత్తం రూ.548.63

సర్విస్‌నెంబర్ 8311301051674 : వాడిన యూనిట్లు 32, మినిమం /ఎనర్జీ చార్జి రూ.63.00చ, పిక్చర్ చార్జి రూ.20.00., కస్టమర్ ఛార్జ్/వినియోగదారుడు కరెంట్ వాడుకున్నందుకు ఛార్జ్ రూ.25.00, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.01.92, ఇంట్రెస్ట్ ఆన్ డ్యూటీ సర్ ఛార్జి రూ.25.00, గ్రిడ్ ఛార్జి, షార్ట్ ఫాల్ ఛార్జి, ఆధర్ చార్జెస్, అడ్జెస్ట్ మెంట్ చార్జెస్, ట్రూ అప్ చార్జెస్ రూ.41.18, ఎఫ్‌పిపిసి రూ.118.73, లాస్/గెయిన్ చార్జెస్, గవర్నమెంట్ సబ్సిడీ చార్జెస్, అరియర్స్ చార్జెస్, అసలు బిల్లు మొత్తం రూ.299.83. పైన చెప్పినవే కాకుండా స్మార్ట్ మీటర్ల ఖరీదు రూ.12500 వినియోగదారునితో ప్రతినెల బిల్లులో యాడ్ చేస్తారు.

పాత మీటర్లు కావాలి స్మార్ట్ మీటర్లు వద్దు

-చాకలి శ్రీనివాసులు, లక్ష్మీ నగర్



గతంలో కరెంటు కోసం మీటర్లకు డబ్బులు కట్టాం ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్లులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు తడిసి మోపిడుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం పాదయాత్రలో లోకేష్‌బాబు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజల అనుమతి లేకుండా ఇండ్ల వద్ద లేని సమయాల్లో స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. ఇప్పుడు మీటర్లు బిగించుకుంటే ఉచితం, తర్వాత డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని మోసపూరిత మాటలు చెబుతూ బిగిస్తున్నారు. ప్రజలపై భారాల మీద భారాలు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను పెట్టే విధానాన్ని రద్దు చేసుకోవాలని లేదంటే జగన్కు పట్టిన గతే పడుతుంది.

రాష్ట్రాన్ని అదానికి అప్పజెప్పారు

- ఇ.పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు



గతంలో ఏ కంపెనీ ఒక సంవత్సరం ఫ్రీ అని, ఆ తర్వాత రూ.పది రీఛార్జ్ చేసుకోవచ్చుని, చెప్పి అలవాటు చేసి ప్రస్తుతం మినిమం రూ.400 తక్కువ లేకుండా రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ప్రధాని మీటర్ల ద్వారా ప్రజలపై భారాలు పడే అవకాశం ఉంది. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత పది యూనిట్లకు రూ.300, 50 యూనిట్లకు రూ.700 బిల్లులు వచ్చాయి. బిజెపి ప్రభుత్వానికి రాష్ట్ర అధికార ప్రతిపక్ష పార్టీలు అదానికి రాష్ట్రాన్ని అప్పజెప్పి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారు. ఈనెల 5న నిర్వహించే విద్యుత్ కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి.

జిల్లా అభివృద్ధే ప్రధాన ధ్యేయం

- ఓర్వకల్లులో రూ.2వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్
- వేదవతి, ఆర్‌డిఎస్ నిర్మాణానికి ఉత్తర్వులు
- ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్లు
- ప్రజాశక్తితో కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు జిల్లా అభివృద్ధే ప్రధాన ధ్యేయమని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓర్వకల్లులో రూ.2వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేదవతి, ఆర్‌డిఎస్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు..?

కలెక్టర్ : జిల్లాలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రోడ్లు లేని గ్రామాల్లో రూ.12 కోట్లతో రోడ్లు వేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసి విద్యాబోధన సాగుతోంది. విద్యార్థులకు సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో రూ.8 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టాం. 80 శాతం పూర్తయ్యాయి. బిసి సంక్షేమ హాస్టళ్లలో రూ.1.5 కోట్లతో మరమ్మతు పనులు చేశాం. కర్నూలు జిజిహెచ్‌లో ఐసిఐసిఐ బ్యాంక్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ మెషిన్ కోసం రిక్వెస్ట్ చేశాం. పవర్ గ్రిడ్ సహకారంతో జిజిహెచ్‌లో అటెండర్లకు విశ్రమ్ శాల పేరుతో వసతి భవనం నిర్మించనున్నాం. ఒక ఎకరాలో 150 పడకలతో వసతులు కల్పించనున్నారు. గ్రీన్‌కో కూడా రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ఆస్పిరేషన్ బ్లాక్ కింద మద్దికెర, చిప్పగిరి మండలాలు దేశంలోనే టాప్‌గా నిలిచాయి. రూ.4 కోట్లు నిధులు కేటాయించారు.

జిల్లాను పారిశ్రామికంగా ఎలా అభివృద్ధి చేయనున్నారు?

కలెక్టర్ : ఓర్వకల్లులో రూ.2వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేయనున్నాం. టెండర్లు కూడా ఫైనల్ అయ్యాయి. ఎపిఐఐసి ద్వారా ఆ పనులు చేస్తున్నాం. 10 వేల ఎకరాలు ఎపిఐఐసి ద్వారా అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయింపులు చేస్తున్నాం. 6 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటికే జైరాజ్ ఇస్పాత్ రెడీగా ఉంది. 300 ఎకరాల్లో డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నాం. వీటితో పాటు పత్తికొండలో రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబర్‌కు దాన్ని పూర్తి చేయనున్నాం.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : జిల్లాలో వేదవతి, ఆర్‌డిఎస్ ప్రాజెక్టులను తిరిగి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్ రాష్ట్ర ప్రాజెక్టులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. గుండ్రేవుల కూడా పరిశీలనలో ఉంది.

జిల్లాలోని యూనివర్సిటీల అభివృద్ధికి చర్యలేమైనా తీసుకున్నారా?

కలెక్టర్ : ప్రస్తుతం ఉన్న భవనాల్లో యూనివర్సిటీలు కొనసాగుతున్నాయి. క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణానికి జగన్నాథగట్టు వద్ద స్థలం ఇచ్చాం. భవనాల నిర్మాణం జరుగుతోంది. ఇంకా రూ.60 కోట్ల దాకా అవసరం ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ట్రిపుల్ ఐటిడిఎం ఇప్పటికే అయిపోయింది. ప్రహరీగోడ మాత్రం కొంత పెండింగ్ ఉంది.

జిల్లాలో పి-4 కార్యక్రమం ఎలా సాగుతోంది?

కలెక్టర్ : పి-4 కార్యక్రమం కింద 64 వేల కుటుంబాలను గుర్తించాం. ఇప్పటికే 30 వేల కుటుంబాల నమోదు పూర్తయింది. మిగతా కుటుంబాలను కూడా పూర్తి చేస్తాం. పి-4 కింద ఒక రైతుకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాం. స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి చేస్తున్నాం. మరో రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం.

గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మీరేమంటారు..?

కలెక్టర్ : రెవెన్యూలో రికార్డుల అప్‌గ్రేడేషన్ చేశారు. ఎక్కువగా భూమికి, కొలతలకు తేడాలు ఉంటున్నాయి. అలాంటి ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి. జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు కూడా ఉంటున్నాయి. జాయింట్ ఎల్‌పిఎం డ్రైవ్ పెట్టుకున్నాం. సివిల్ సమస్యలైనా అన్నదమ్ముల భూ సమస్యలు, కుటుంబ సభ్యుల సమస్యలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. అవి సివిల్ కోర్టులో తేల్చుకోవాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకూ అన్నిటినీ పరిష్కరించేందుకే చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లా విజన్ 2047 ప్లాన్ ఎలా ఉంది..?

కలెక్టర్: విజన్ 2047లో భాగంగా 2047 ప్లాన్‌తో పాటు ఐదు సంవత్సరాల ప్రణాళిక కూడా సిద్ధం చేశాం. జిల్లా ఆర్థికాభివృద్ధి రూ.47,514 కోట్ల నుంచి రూ.95,567 కోట్లకు పెరిగేలా ప్రణాళిక రూపొందించాం. తలసరి ఆదాయం రూ.1.74 లక్షల నుంచి రూ.3.51 లక్షలకు పెరగాలి. మొదటి సంవత్సరం లక్ష్యాన్ని అచీవ్ అవుతాం. 15 శాతం అభివృద్ధి సాధిస్తాం.



ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

రూ.1.10 లక్షలు జరిమానా విధించిన జెసి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో పలుచోట్ల ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆహార కల్తీలకు పాల్పడిన పలువురు వ్యాపారులకు రూ.1,10,000లను జిల్లా జాయింట్ కలెక్టర్ జరిమానా విధించారు. ఐదు వ్యాపార సంస్థలు, ఒక ప్రభుత్వ పాఠశాలలో ఈ కల్తీ ఆహారం బయటపడినట్లు కర్నూలు ఫుడ్ సేఫ్టీ అధికారి టి. రాజగోపాలరావు తెలిపారు. వీటిపై కేసులు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ప్రవేశపెట్టగా జాయింట్ కలెక్టర్ బి నవ్య జరిమానా విధించారని తెలిపారు. ఈ తనిఖీలను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కుర్మా నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

-ప్రతిపక్ష పార్టీకి సింగిల్ డిజిట్ సీట్
-జిల్లాలో వలసల నివారణకు చర్యలు
-సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
-పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో రూ 10 లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ వెల్లడించారు. ఆదివారం కర్నూలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టిజి.భరత్ మాట్లాడారు. సింగపూర్‌లో నిర్వహించిన పారిశ్రామిక సదస్సులో అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష వైసిపి వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్ సీటుకు మాత్రమే పరిమితం కానుందని పేర్కొన్నారు. ఓర్వకల్ పారిశ్రామిక వాడలో కూడా రానున్న రోజుల్లో అనేక పరిశ్రమలు రానున్నాయని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని వెల్లడించారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో నిర్వహించిన పారిశ్రామిక సదస్సులో అనేక సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు పోర్టులను అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధిలో సింగపూర్ లోని అనేక సంస్థలు భాగస్వామ్యం కానున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికపరంగా అభివృద్ధి నోచుకోలేదన్నారు. అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుంటే కొందరు ఈమెయిల్స్ పంపి పెట్టుబడులు పెట్టకుండా అడ్డుకుంటు న్నారన్నారు. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడ లేనటువంటి పాలసీని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలన్నిం టిని నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన మద్యం కుంభకోణం కేసు కంటే రాష్ట్రంలో లిక్కర్ స్కాం అవినీతి జరిగింద న్నారు. లిక్కర్ స్కామ్‌లో ఎంతటి వారనై నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి భరత్

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం : కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు అన్నిటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్ ను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక కూడా రూపొందించామన్నారు. అనంతపురం నుండి కర్నూలు పారిశ్రామిక క్యారీడారును కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. ఓర్వకల్ విమానాశ్రయాన్ని పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఓర్వకల్ పారిశ్రామిక వాడకు నీటి సౌకర్య కల్పనకు సంబంధించిన పనులను 90 శాతం పనులను పూర్తి చేసామన్నారు. ఇంకా రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పుతామని ఆయన వెల్లడించారు.



చైర్మన్ రమణను , సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత

ఉలిందకొండ సహకార సొసైటీ చైర్మన్ పమాణ స్వీకారం

-చైర్మన్ , సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం ఉలిందకొండ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన ఇవి రమణ, డైరెక్టర్లు తెలుగు మురళి, బి నాగరాజు ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఉమ్మడి జిల్లా టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి, యువ నాయకులు గౌరు జనార్దన్‌రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ఎపి సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిలు రమణను, సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదెన్న రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, కల్లూరు మండలం పరిధిలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆశావాది సాహిత్య పురస్కారం అందుకుంటున్న సవ్వప్పగారి ఈరన్న

సవ్వప్పగారి ఈరన్నకు ఆశావాది సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఈ సంవత్సరం పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం కర్నూలుకు చెందిన 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, డాక్టర్ ఆశావాదిఅవధాన పురస్కారం అనంతపురానికి చెందిన అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు ఆదివారం హైదరాబులో అందజేశారు. ఆశావాది సాహితీ కుటుంబం ఆధ్వర్యంలో 'అవధానాచార్య' పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు 82వ జయంతి వేడుకలు ఉప్పల్‌లో నిర్వహించారు. పద్మశ్రీడాక్టర్ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, డాక్టర్ ఆశావాది అవధాన పురస్కారం అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు అందజేశారు. పద్యప్రబంధ కవి అన్న మరాజు ప్రభాకరరావు సభాధ్యక్షత వహించారు. విజయసారథి , వడ్లూరి ఆంజ నేయులు, నందూరి విద్యారణ్య స్వామి అతిథులుగా పాల్గొన్నారు. శతా వధాని ఆముదాల మురళి, డాక్టర్ ఆశావాది సుధామ వంశి, పురస్కార గ్రహీ తలను పరిచయం చేశారు. ఉప్పలూరి ఆత్రేయ శర్మ, డాక్టర్ మల్లిపూడి రవి చంద్ర, యెల్చాల నర్సింహులు, ఆశావాది శిరీష వాణి, లక్ష్మీ మానస, శ్రీవల్లి, వసంతగౌరి తదితరులు పాల్గొన్నారు. అష్టావధాని సమ్మెట మాధవరాజు , తెలుగు సేత గావించిన జాంబవతీ పరిణయం పుస్తక పరిచయం కళారత్న ఆము దాల మురళి చేశారు.

5న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న ఇండస్ట్రీయల్ ఎస్టేట్ లోకరెంట్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు కోరారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో 32వ వార్డు సుందరయ్యనగర్ ఆటో స్టాండ్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుదాకరప్ప, వై సుధాకర్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్ హుస్సేన్‌బాష, కెవిపిఎస్ నగర సహాయ కార్యదర్శి ఎంసి ఆనంద్ మాట్లాడారు. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని కరెంటు చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి అమలు చేయలేదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారాలు పడడమే కాకుండా మీటర్ చార్జి వినియోగదారుడు భరించాలన్నారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడి అరికట్టాలి :కెవిపిఎస్

కల్లూరు అర్బన్ పరిధిలో 30వ వార్డు ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆదాని స్మార్ట్ బాంబు మా ఇంటికి బిగించొద్దు అని కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్షులు జి యేసు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి బాటలో టిడిపి కూటమి ప్రభుత్వం నడుస్తుందన్నారు. స్మార్ట్ పీటర్లకు వ్యతిరేకంగా ఐదో తేదీ జరుగు ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజలతో సంతకాల సేకరణలో ఎన్.అలివేలు, వై.నగేష్ తదితరులు



ప్రజలతో సంతకాల సేకరిస్తున్న ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు

31వ వార్డులో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం

షరీన్ నగర్ బద్రీనాథ్‌నగర్ 31 వార్డులో ఐద్వా ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు ఆదాని బాంబు మా ఇంటికి బిగించొద్దు అని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఆదాని బాంబును మా ఇంటికి బిగించొద్దు అని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 31 వార్డులో ప్రజలను చైతన్యం చేసి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ చేసారు. ఈ సంతకాల సేకరణలో వార్డు మహిళా సంఘం నాయకురాలు బి లక్ష్మీదేవి, ఎస్ కాజా బి, మాట్లాడారు.

5న ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరంలోని స్థానిక వీకర్ సెక్షన్ కాలనీ నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలకు భారీగా ఆర్థిక భారంగా మారే ఆదాని విద్యుత్తు స్మార్ట్ మీటర్లని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, నగేష్ వార్డు నాయకులు జమ్మన్న, రహ్మాన్ సంతకాల సేకరణ కార్యక్రమం చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ సంస్కరణలలో భాగంగా ప్రజల పైన భారీగా భారాలు సర్దుబాటు చార్జీల పేరుతో మోపుతున్నారని ,ఇప్పుడు కొత్తగా ఈ స్మార్ట్ మీటర్ పెట్టడం ద్వారా మొదట ఉచితంగా అని చెప్పిన తర్వాత కాలంలో ఆ మీటరు రేటు మొత్తం ప్రజలే భరించాల్సి వస్తుందని తెలిపారు. ఇది ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ కావడంతో ముందే ప్రజలు డబ్బులు కట్టి విద్యుత్తుని వినియోగాన్ని పొందవలసి వస్తుందని డిమాండ్‌ను బట్టి ఒక్కో సమయంలో ఒక్కో రేటు వేయడం వల్ల మరింత భారంగా మారే పరిస్థితి వస్తుందని తెలిపారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాలు ముందు నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యర్రగుడి ఈశ్వర్‌రెడ్డి స్ఫూర్తితో పోరాటం

నేడు 46వ వర్ధంతి



ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి 46వ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన పోరాటాలు త్యాగాలు గుర్తు చేసుకుంటూ ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం సీనియర్ నాయకుడు రంగారెడ్డి , మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు. ఈశ్వర్ రెడ్డి 40 సంవత్సరాలు సుదీర్ఘమైన పోరాటాలు జరిపి పత్తికొండ ప్రజలు కష్టాలు తీర్చారన్నారు. ఆయనకు 20 సంవత్సరాల వయసులోనే పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెళ్ళ నాగిరెడ్డి, మోటూరు హనుమంతరావు, చండ్ర పుల్లారెడ్డితో పరిచయాలు ఏర్పరచుకొని ప్రజా ఉద్యమాలు వైపు తన ప్రయాణం సాగించారు. ఆనాడు ఆంధ్రాలో జరుగుతున్న తెలంగాణ విప్లవ సాయుధం భూ పోరాటం స్ఫూర్తితో పత్తికొండ ప్రాంతంలో భూమిలేని నిరుపేదలను గుర్తించి తుగ్గలి మండలం జొన్నగిరి ,ఎర్రగుడి గ్రామాల సమీపంలో ఆయన పిలుపును అందుకొని హరిజన, గిరిజన, బలహీన వర్గాలు పేదలందరూ ఈ ఎర్రజెండా నాయకత్వాన 750 ఎకరాలు ప్రభుత్వ భూమిని సాగులోకి తెచ్చుకున్నారు. మూడేళ్ల పాటు పోరాటాలు జరిపి జైలులు కేసులను జయించి పైసా ఖర్చు లేకుండా భూ హక్కు పత్రాలను ఇప్పించారు. 1967 పత్తికొండ అసెంబ్లీ ఎన్నికలలో మాజీమంత్రి కేబీ నరసప్ప పై పోటీ చేసి గెలిచారు. కరువు పరిస్థితులు ప్రభుత్వం దష్టికి తెచ్చారు. ఓర్వ లేని దుర్మార్గులు 1979 ఆగస్టు 4న బస్సులో పయనిస్తున్న ఈశ్వర్ రెడ్డిని అతికిరాతకంగా హత్య చేశారు. పత్తికొండ నియోజకవర్గం అప్పటినుండి ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. అందుకే ప్రజా ఉద్యమాలు అయిన పేరట నిర్మించి ఆయనకు అంకితభావం ఇవ్వాలి ఆయన కలలను సాకారం చేయాలి.అప్పుడే ఆయనకు నిజమైన నివాళి.




కరాటేతో క్రమశిక్షణ

కరాటే పోటీలను ప్రారంభిస్తున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

జిల్లా స్థాయి కరాటే పోటీలను డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. శిక్షకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు అవుట్ డోర్ స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి డాక్టర్ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ జపాన్ దేశంలో అక్కడి ప్రజలు మంచి ఆహారం, స్నేహభావంతో పాటు కరాటే చేయడం వల్ల వంద సంవత్సరాల పాటు ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. భారతదేశంలో కేరళలోని కలారీ ప్రాంతంలో అదే తరహాలో చేస్తున్నారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ బ్రూస్‌లీ వల్ల ఎంతో ప్రాముఖ్యతను పొందిందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచ వ్యాప్తంగా మార్షల్ ఆర్ట్స్‌ను ఎంతో మంది నేర్చుకున్నారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో ధ్యానం, యోగా, వ్యాయామం ఉందన్నారు. అందువల్ల క్రమశిక్షణ అవలంభిస్తుందన్నారు. ప్రస్తుతం సమాజంలో క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. క్రీడల్లో పాల్గొంటే కులమతాలకు అతీతంగా అందరితో కలిసి మెలిసి ఉంటారని దీని వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. స్నేహితుల దినోత్సవ స్ఫూర్తితో విద్యార్థులు అందరూ స్నేహంగా ములగాలని సూచించారు. ఈసందర్భంగా విజేతలకు డాక్టర్. శంకర్ శర్మ జ్ఞాపికలను అందజేశారు.



విద్యార్థులు స్నేహంతో మెలగాలి

-మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : విద్యార్థుల మధ్య స్నేహ బావం ఎంతో ముఖ్యం జీవితంలో విద్యార్థి దశ మరుపు రానిదని అందులో స్నేహితుల మధ్య ఏర్పడే అనుభూతులు మరుపురానివని కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ అన్నారు. ఆదివారం మెడికల్ కాలేజీలోని యూజీ హాస్టల్‌లో నిర్వహించిన ఫ్రెండ్‌షిప్ డేకు హాజరై స్నేహం గురించి వివరించి వైద్య విద్యార్థులుగా సమాజానికి ఎంతో సేవ చేయాల్సి ఉందన్నారు. అనం తరం సీనియర్ జూనియర్ విద్యార్థులు హాస్టల్లో మొక్కలు నాటి పరి సరా లను శుభ్రం చేశారు. యూజీ హాస్టల్ వార్డెన్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర రావు, డిప్యూటి వార్డెన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.సోమ శేఖర్, అసిస్టెంట్ వార్డెన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పిఆర్‌ఒ సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

స్మార్ట్ మీటర్లపై ఉద్యమం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాదికాలంలోనే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు వేసిందని, ఇది చాలదన్నట్లు ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్ బిగించి మరింత భారం మోపాలని చూస్తోందని, ఈ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతున్నట్లు సిపిఎం పార్టీ కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు తెలిపారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో వేసిన విద్యుత్ ఛార్జీల భారాల్ని ఒక్క సంవత్సరంలోనే కూటమి ప్రభుత్వం వేసిందని విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ఇప్పటికే తీవ్ర ఉద్యమాలు జరిగాయని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. కార్యకర్తలు అందరూ కూడా ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి, ఎం.ఉచ్చీరప్ప, రామాంజనేయులు, మండల నాయకులు బాష, అయ్యప్ప, మునిస్వామి, పాండురంగ, తిక్కప్ప, హనుమంతు శాఖ కార్యదర్శులు నాగరాజు, అయ్యన్న, పాండవగల్ సర్పంచి కె.ఉమాదేవి, శాఖ కార్యదర్శులు నాగరాజు, విరుపాక్షి, పరమేష్, నరసమ్మ పాల్గొన్నారు.

5న విద్యుత్ కార్యాలయం ముందు ధర్నాలు

- ప్రజాసంఘాల ఐక్యవేదిక



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 5న విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతున్నట్లు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఆదివారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బి.రాముడు, ఎ.సురేష్, బి.తిమ్మప్ప మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల పేదలు, బడుగు, బలహీన వర్గాలు, కార్మికులు, చేతివృత్తిదారులు, వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై వేసిన విద్యుత్ భారం తగ్గించాలని కోరారు. ఇప్పటికే షాపులకు స్మార్ట్ మీటర్లు యజమాని అనుమతి లేకుండా బిగించారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ఈనెల 5న విద్యుత్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాకు ప్రజలు తరలి రావాలని కోరారు.

మన్ననలు పొందినప్పుడే గుర్తింపు

- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



బస్సును ప్రారంభిస్తున్న ప్రదీప్‌రెడ్డి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చే భక్తులు, ప్రయాణికుల మన్ననలు పొందినప్పుడే ట్రావెల్స్‌కు తగిన గుర్తింపు వస్తుందని ట్రావెల్స్ నిర్వాహకులకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానికంగా శ్రీసన్నిధి ట్రావెల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వారి దర్శనార్థం కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారని తెలిపారు. భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం మంత్రాలయం నుంచి కర్ణాటక రాష్ట్రం మైసూరు వరకు ప్రయివేట్ బస్సు నడపడం అభినందనీయమని చెప్పారు. మంగళూరుకు చెందిన శ్రీసన్నిధి ట్రావెల్స్ యజమాని సతీష్ మాట్లాడుతూ... మంత్రాలయం నుంచి మంగళూరు వరకు వెళ్లే ఈ స్లీపర్ బస్సు వయా ఉడిపి, మనిపాల్, కుందాపూర్, శివమొగ్గ, బళ్లారి మీదుగా వెళ్తుందని తెలిపారు. అంతకు ముందు బస్సు యజమాని ఆహ్వానం మేరకు మంత్రాలయం వచ్చిన ప్రదీప్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా, పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి బస్సును ప్రారంభించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైసిపి నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, బొజ్జప్ప, రాము, మారెప్ప పాల్గొన్నారు.

కనిపించని ధరల పట్టిక..!

- ఉరుకుందలో ఆగని దోపిడీ..!

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాసోత్సవాల్లో నిలువు దోపిడీ కొనసాగుతూనే ఉంది. భక్తులు దోపిడీకి గురి కాకుండా దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం ధరల పట్టికను (బోర్డు) ఏర్పాటు చేయాల్సి ఉంది. పుణ్యక్షేత్రంలో అవి ఎక్కడా కనిపించకపోవడంతో భక్తులు



టెంకాయల అంగళ్లు

అధిక ధరలకు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ ఉత్సవాల్లో అనేకమంది స్వామి దర్శనం కోసం నిరుపేదలే వస్తుంటారు. ఇలాంటివారు స్వామివారి కోసం టెంకాయలు అధిక ధరలకు కొనడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

ధరలు తగ్గించిన అధికారుల నోటీసులు

శ్రావణ మాసోత్సవాల్లో భక్తులు నిలువు దోపిడీ గురవుతున్నారని భక్తుల ఆవేదనలను పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయ రాజు టెండర్ దారులకు నోటీసులు జారీ చేశారు. టెండర్ నిబంధనల ప్రకారం ఒక టెంకాయ రూ.20లకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవదాయ శాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆదివారం టెంకాయల ధరలు తగ్గలేదు.. తగ్గేది లేదు..! అనే విధంగా అమ్మకాలు సాగుతున్నాయి.

జత టెంకాయలు రూ.100



ఈశ్వరయ్య

శ్రావణమాసోత్సవాల్లో భాగంగా బెళగల్ మండలానికి చెందిన భక్తుడు ఈశ్వరయ్య పుణ్యక్షేత్రానికి టెంకాయల ధరలను చూసి అవాక్కయ్యారు..! ఈశ్వరయ్య మాట్లాడుతూ... ఇలాంటి ధరలు ఉంటే మాలాంటి సామాన్య భక్తులు ఎలా కొనాలి..? స్వామివారికి మొక్కుబడులు ఎలా తీర్చుకోవాలని ప్రశ్నించారు. ధరలు తగ్గించి ఇవ్వమంటే.. తగ్గించేదే లేదని కరాకండిగా చెబుతున్నారని వాపోయారు.

బోర్డులు ఏర్పాటు చేశాం

- డిప్యూటీ కమిషనర్ విజయరాజు



పుణ్యక్షేత్రంలో రూ.20లకే టెంకాయ (ఒకటి) విక్రయించాలని, తలనీలాలు (రూ.40) టికెట్టు తీసుకున్న భక్తులు ఎటువంటి డబ్బులూ చెల్లించరాదని బోర్డులు ఏర్పాటు చేశాం. అంతకుముందే వారికి కౌన్సెలింగ్ కూడా ఇచ్చాం.

కానిస్టేబుల్‌గా పేదింటి ఆణిముత్యం

ప్రజాశక్తి- దేవనకొండ



మండలంలోని పాలకుర్తి గ్రామానికి చెందిన ముక్కెళ్ల విమలమ్మ, వెంకటేశ్వర్ల కుమార్తె భారతి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. భారతి తండ్రి మృతి చెందగా తల్లి అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటూ కుటుంబానికి పెద్ద దిక్కు అయ్యారు. భారతి ప్రతిభ చూపి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దళిత వర్గంలో పుట్టి కడు పేదరికం అనుభవించిన భారతి ఎంపికపై గ్రామ పెద్దలు, గ్రామస్తులు, బంధు మిత్రులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా




ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని రైతులకు అందుబాటులో యూరియా అందుబాటులో ఉన్నట్లు ఎఒ ఉషారాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. 90.10 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ప్రయివేట్ డీలర్స్ అయిన దేవనకొండ, తెర్నేకల్లులో ఉన్న కోరమండల్, కిషన్ మాల్‌లో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎంఆర్‌పి ధరకే ఇవ్వనున్నట్లు, కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకొని డిబిటి ద్వారా (వేలి ముద్ర) వేసి తీసుకోవాలని చెప్పారు.

శ్రీమఠంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయ పిఆర్‌ఒ హొన్నిళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు ఆయనకు శేషవస్త్రం, ఫల మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు. శ్రీమఠం ద్వారపాలకులు అనంత స్వామి, ప్రకాష్ స్వామి, పవన్ స్వామి పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ యార్డు సందర్శన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డును వైసిపి నాయకులు సందర్శించారు. ఆదివారం అక్కడికి వచ్చిన రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కష్టాలు, మౌలిక వసతుల లోపాలు, మార్కెట్ యార్డులో నెలకొన్న వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు విశ్రాంతి కోసం నిర్మించిన రైతు విశ్రాంతి భవనం అసంపూర్తిగా ఉందని, దానికి మరమ్మతులు చేసి పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో రైతులు ధాన్యాన్ని తెచ్చినప్పుడు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం తడవడం వల్ల రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి ముగతి విరుపాక్షి రెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం సంయుక్త కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మ రాజశేఖర్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, నియోజవర్గ యూత్ అధ్యక్షులు బోయ రాజు, వైఎస్‌ఆర్‌టియుసి పట్టణ అధ్యక్షులు బోయ శ్రీనివాసులు, 18వ వార్డు ఇన్‌ఛార్జీ సోమేష్, అనీఫ్, సోషల్ మీడియా రవికుమార్, 5వ వార్డు ఇబ్రహీం పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బుట్టా నీలకంఠ

బాలగురుస్వామికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

- నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా సెక్రటరీ వీరేష్

ప్రజాశక్తి - హాలహర్వి



టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరి బాలగురుస్వామికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సంఘం జిల్లా సెక్రటరీ వీరేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులు దేవాలయాల్లో కానీ, వివాహ కార్యక్రమాల్లో కానీ, ఊరేగింపులో కానీ ముందుంటారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వారిని గుర్తించడం లేదని చెప్పారు. ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

గ్రామీణ వైద్యం.. గాలిలో దీపం..!

- పూర్తికాని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు - బిల్లులు రాక మధ్యలోనే నిలిచిన వైనం

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామీణ వైద్యం గాలిలో దీపంలా తయారయింది. బిల్లులు రాక విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పూర్తి కాలేదు. నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్ భారత్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రవేశపెట్టారు. వీటి నిర్మాణాలు చాలా చోట్ల పూర్తి కాలేదు.

గత వైసిపి ప్రభుత్వంలో ఆస్పరి మండలానికి 16 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. నిధులు సక్రమంగా మంజూరు కాకపోవడంతో హెల్త్ కేంద్రాలు మధ్యలోనే నిలిచిపోయాయి. గత మూడేళ్లగా కాంట్రాక్టర్లకు నిధులు రాకపోవడంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. అందుబాటులో సరైన వైద్య సేవలు లేక గ్రామీణులు ప్రయివేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపిలపై ఆధారపడి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం కోసం అప్పటి అధికారులు ప్రతిపాదన పంపించారు. ఒక్కో భవనానికి రూ.17.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు. మండలానికి రూ.2,62,50,000తో 16 విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు మంజూరు కాగా అందులో ఆరు మాత్రమే పూర్తయ్యాయి.

బిల్లులు మంజూరు కాక

ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని గుత్తేదారులు మొదలు పెట్టారు. గత వైసిపి ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. నిర్మాణం పూర్తయిన 6 కేంద్రాల్లో 4 వినియోగంలో ఉన్నాయి. కొన్ని మధ్యలో నిలిచిపోయినా వాటిని పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆయూష్మాన్ భారత్ కేంద్రాల నిర్మాణం త్వరగా పూర్తి చేసి పేదలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో శంకర బండ, చిన్న హోతూరు, ములుగుందం-1, కైరుప్పల, యాటకల్లు, బనవనూరు గ్రామాల్లో హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తయ్యాయి. కైరుప్పల, చిన్న హోతూరు గ్రామాల్లోని హెల్త్ సెంటర్లు పంచాయతీ రాజ్ అధికారులు అప్పగించినా ఆరోగ్య శాఖ అధికారులు ఇంకా ప్రారంభించలేదు. ఆస్పరి-2, ములుగుందం-2, కారుమంచి గ్రామాల్లోని భవనాలు ఫినిషింగ్ దశలో ఉన్నాయి. బిల్లేకల్లు, డి.కోటకొండ, నగరూరులోని కేంద్రాలు బేస్ మట్టంలో నిలిచిపోయాయి. ముత్తుకూరు, బిణిగేరిలోని కేంద్రాలు శ్లాబ్ దశలో ఉన్నాయి. చిగిలి భవనం పునాదికే పరిమితమైంది. హాలిగేర భవనం పునాదికి కూడా నోచుకోలేదు.



పునాదికి కూడా నోచని హాలిగేర హెల్త్ సెంటర్



ఫినిషింగ్‌లో ఉన్న కారుమంచి హెల్త్ సెంటర్

బిల్లులు మంజూరయితే పనులు చేపడతాం

- వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఎఇ, ఆస్పరి



నిలిచిపోయిన హెల్త్ కేంద్రాలకు ప్రభుత్వం బిల్లులను మంజూరు చేసిన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్త - ఎమ్మిగనూరు

మండలంలోని పార్లపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. ఆదివారం ఎమ్మిగనూరు వాల్మీకి యూత్ భారీగా దాదాపు 100కు పైగా బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించి పట్టణం నుంచి పార్లపల్లి గ్రామానికి చేరుకున్నారు. వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోగనూరు జగదీశ్, కడివెళ్ల గుంటెప్ప, తిమ్మాపురం వీరభద్రి, బోడబండ రామకృష్ణ పాల్గొన్నారు.

మురునీటితో దుర్వాసన

- వంకల్లో పూడిక తొలగింపు
- శాశ్వత సమస్య పరిష్కార పనులకు ప్రతిపాదన

ప్రజాశక్తి - ఆదోని



పూడిక తీయిస్తున్న అధికారులు

చిన్నపాటి వర్షం కురిసినా వంకలు పొంగిపొర్లి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి మురుగుతో దుర్వాసన వస్తోంది. నీరు నిలిచిన ప్రదేశాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. పాలకులు మారినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ముందస్తుగానే మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం, ఇతరత్రా వ్యర్థపదార్థాలు పేరుకుపోయి కల్వర్టుల వద్ద అడ్డుగా నిలవడంతో నీరు పారేందుకు అవకాశం లేక జలమయమవుతోంది.

కాలువల్లో పూడిక తొలగింపు ముమ్మరం

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని



కాలువల్లో పూడిక తీసి ముళ్లకంపలు తొలగింపు పనులకు శ్రీకారం చుట్టాం. సుమారు రూ.17 లక్షలు ఖర్చు చేసి నివారణ చర్యలు చేపట్టాం. పట్టణంలో ఆవుదూడ వంక, జై హింద్ వంకలో చెత్తాచెదారం, పూడిక తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఆదిత్య నర్సింగ్ హోమ్ నుంచి కుని మహల్, వడ్డే గేరి, బొబ్బులమ్మ గుడి, టిజిఎల్ కాలనీ, రాయ నగర్, జై హింద్ వంకలో ఆర్‌టిసి కాలనీ, శివ శంకర్ నగర్, డీఎస్పీ బంగ్లా, క్రాంతి నగర్, లేబర్ కాలనీ, పంజరాపోలు, వింధ్యాశ్రీ స్కూల్, కల్లుబావి, రేణుకాంబ హోటల్ తిమ్మారెడ్డి బస్టాండ్, గోశాల కాలువల్లో పూడిక తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి నాణ్యతగా పనులు జరిగేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. రైతు బజార్ మర్చంట్ క్లబ్ వద్ద కల్వర్టు బ్లాక్ కావడం వల్ల నీరు నిలిచి ఉంటుంది. రైల్వే అధికారులతో మాట్లాడి చెత్తాచెదారం నిలవకుండా కల్వర్టు వెడల్పు జరిగేలా చూస్తాం.

శాశ్వత చర్యలు తీసుకుంటాం

- లోకేశ్వరి, మున్సిపల్ చైర్మన్, ఆదోని



చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శాశ్వత నివారణ చర్యలు చేపట్టేలా ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులకు సూచించాం. పట్టణంలో జైన్ మందిర్, శ్రీనివాస భవన్ ముందు, మున్సిపల్ రోడ్డులోని మమ్మీ డాడీ షో రూమ్ వద్ద, రైతు మార్కెట్, మర్చంట్ క్లబ్, రెవెన్యూ భవన్ ప్రాంతాల్లో నీరు ఎక్కువగా నిలుస్తున్నట్లు సర్వే చేయించాం. ఎప్పటికప్పుడు మురుగు కాలువలో చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. కాలువల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడం వల్ల కల్వర్టు వద్ద నీరు నిలిచి రోడ్లపైకి వస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి అవకాశం ఉంటే చూడాలని అధికారులకు సూచించాం. ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ముఖ్యమంత్రిని కలిసి శాశ్వత నివారణ చర్యలు చేపడతాం.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ఎల్‌ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ

కాలువ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం బస్టాండ్‌లో గత కొన్ని ఏళ్లుగా ఎల్‌ఎల్‌సి టిబిపి-65 కాలువపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. తహశీల్దార్ రమేష్, టిబిపి ఇరిగేషన్ ఆదోని డిఇ మహ్మద్ షఫీ, ఎఇ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆదివారం తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత కొన్నేళ్లుగా కాలువ ఆక్రమణకు గురైందని, ఇప్పటికే చాలాసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించలేదని తెలిపారు. హోటల్, పంచర్ షాప్, కాంప్లెక్స్, ఇంటి యజమానులు స్పందించలేదని ఉన్నతధికారుల ఆదేశాల మేరకు జెసిబిలు పెట్టి తొలగింపులు చేపట్టామన్నారు. తొలగింపు కార్యక్రమం సుమారు మూడు రోజులు పడుతుందని తెలిపారు. సర్పంచి హెచ్.రాము, సాగునీటి సంఘం అధ్యక్షులు గురులింగ, విఆర్‌ఒ బసవరాజ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- పోలీసు ఉన్నతాధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చిప్పగిరి

పత్తికొండ, గుంతకల్, సబ్ డివిజన్లలో పోలీసు విధులను మెచ్చి ఘన సన్మానం చేశామని పత్తికొండ డీఎస్పీ బావిగడ్డ వెంకటరామయ్య తెలిపారు. ఆదివారం గుంతకల్లులో డీఎస్పీ నివాసగృహంలో పోలీసు ఉన్నతాధికారులకు ఘన సన్మానం చేపట్టారు. జులై 31న గుంతకల్లులో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య కుమార్తె వర్షిణి, సాయికిరణ్ వివాహం బళ్లారి, ఉరవకొండ, ఆలూరు రోడ్ల కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, విజిలెన్స్ ఎస్పీ, కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డ, పత్తికొండ, ఆదోని, గుంతకల్లు, ఉరవకొండ, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, బళ్లారి, అనంతపురం, పట్టణాల నుంచి వేల సంఖ్యలో వివిధ పార్టీలకు చెందిన అఖిలపక్ష నాయకులు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఆలూరు టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, తుగ్గలి నాగేంద్ర, పారిశ్రామికవేత్తలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బళ్లారి, ఆదోని, ఉరవకొండ, అనంతపురం, గుంతకల్లు రహదారులు పూర్తిగా ట్రాఫిక్ ఏర్పడింది. గుంతకల్లు సబ్ డివిజన్‌లో పోలీసులు డీఎస్పీ శ్రీనివాసులు, మస్తాన్, మనోహర్, సిఐలు, ఎస్ఐలు ట్రాఫిక్ అంతరాయం లేకుండా విధులు నిర్వహించి 'శభాష్ పోలీస్' అనే విధంగా విధులు నిర్వహించారు. ఆదివారం పోలీసు ఉన్నతాధికారులకు డీఎస్పీ వెంకటరామయ్య స్వగృహంలో సన్మానం నిర్వహించి, విందు ఏర్పాటు చేశారు. పత్తికొండ, గుంతకల్లు డీఎస్పీలు వెంకటరామయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐలు మస్తాన్‌వలీ, మధుసూదన్, జయన్న, పులి శేఖర్, ఎస్ఐలు దిలీప్ కుమార్, మహబూబ్ బాషా, మారుతి, రాజ కుళ్లాయప్ప, పోలీసులు పాల్గొన్నారు.



డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న డీఎస్పీ



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

ఉరుకుంద సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సతీమణి జయమ్మ, టిటిడి కమిటీ మాజీ సభ్యులు వై.సీతారామరెడ్డి, సతీమణి గిరిజమ్మలు పుణ్యక్షేత్రానికి చేరుకోగా దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో అధికారులు, దేవాలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వేదపండితులు మురళీ శర్మ, ముఖ్య అర్చకులు నాగరాజు స్వామి, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, పురుషోత్తం రెడ్డి, వెంకటరామ్ రెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, లింగన్న గౌడ్, దోశల అయ్యప్ప, హుసేని, విజయ్ కుమార్, రాముడు, ఇద్రూస్, ముకన్న, అంజి, చూడి రమేష్, చూడి నాగరాజు, శరణ పాల్గొన్నారు.

స్నేహబంధమే మిన్న..!

- ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని


అన్ని బంధాల కన్నా స్నేహబంధం మిన్న అంటూ స్నేహితులు తెలిపారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగులు, నెహ్రూ మెమోరియల్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రహదారి వద్ద రిటైర్డ్ ఉద్యోగులు నాగప్ప, ఓబుళపతి, శ్రీనివాస్, నరసయ్య, సురేష్, రామన్న, రమేష్ నాయుడు కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల 1986-87 పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలలో కేక్ కట్ చేశారు. పాఠశాల మైదానం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సునీల్ రాజ్ కుమార్, ప్రేమ్ కుమార్, పంపాపతి మాట్లాడారు. తాను ఇదే పాఠశాలలో చదువుకొని ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేయడం మర్చిపోలేనని సునీల్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు లక్ష్మణ, అను, అన్వర్, పంపాపతి, కేశవ, నాగరాజు, నల్లన, ఈరన్న, వీరేంద్ర, రుద్రముని, లక్ష్మీనారాయణ, గోపాల్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి- దేవనకొండ




పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' మొదటి విడత పంపిణీ చేసినందుకు ఆదివారం టిడిపి కార్యాలయం ఆవరణంలో మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, టిడిపి నాయకులు అలారుదిన్నె మల్లయ్య, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, గిడ్డయ్య గౌడ్, రాజగోపాల్ గౌడ్, కరిడికొండ సర్పంచి హనుమంతు, గుడిమిరాళ్ల సర్పంచి శేషిరెడ్డి, తెర్నేకల్ బాటమీద చిన్న వెంకప్ప, బాట మీద రాజు, కోలంట్ల రంగన్న, జనసేన నాయకులు రామాంజనేయులు, బిజెపి నాయకులు జంగం వీరయ్య పాల్గొన్నారు. అలాగే టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపునకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు నాయకంటి రాజశేఖర్, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, టిడిపి సీనియర్ నాయకులు బడి గింజల రంగన్న, మాలిక్ బాషా, పట్టణ అధ్యక్షులు మస్తాన్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు కుక్కల తిమ్మయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. టిడిపి నాయకులు రాజసాహెబ్, రాముడు, వార్డు మెంబర్ రామాంజనేయులు, మజీద్, సుభాన్, బంగి రంగన్న, చాందు, బడే సాహెబ్, మోదీన్, జనసేన నాయకులు కె.ఉచ్చీరప్ప, బూసల రామాంజనేయులు, గొల్ల ఈశ్వర్, బాలు, చంటి, బిజెపి నాయకులు జంగం వీరయ్య పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

- స్నేహితుని కుమార్తె పేరుతో రూ.60 వేలు డిపాజిట్

ప్రజాశక్తి - మంత్రాలయం



బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సహ విద్యార్థి డి.భీమేష్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం రామచంద్ర నగర్ కాలనీలో ఉన్న భీమేష్ ఇంటికి వెళ్లి బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన బాండ్ (రూ.60 వేలు)ను అందజేశారు. 2003-04లో పదో తరగతి చదువుకున్న వారు తమ స్నేహితుడు అనారోగ్య సమస్యతో మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితుని కుటుంబానికి తమ స్థోమతకు తగ్గట్టు ఆలోచించి మిత్రులందరూ డబ్బులు జమ చేసి వారి కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. డబ్బులు చేతికి ఇస్తే అవసరాలకు ఖర్చు చేస్తారని భావించి మిత్రుని కుమార్తె డి.దీక్షిత పేరు మీద రూ.60 వేలను కెనరా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానికి సంబంధించిన బాండ్‌ను భీమేష్ కుమార్తె దీక్షిత, భార్య రాధ చేతికి అందించారు. యు.వీరేష్, బసవ రాజు, మెడికల్ కోటి, రాఘ వేంద్ర, నాగరాజు, రాజేష్, సుధామణి, సుజాతకు భీమేష్ భార్య రాధ, కుమార్తె దీక్షిత కృతజ్ఞతలు తెలిపారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఆర్‌యు వెబ్‌సైట్‌ను రద్దు చేసిన గూగుల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను గూగుల్ సంస్థ రద్దు చేసింది.. యూనివర్సిటీ అధికారులు సకాలంలో రెన్యూవల్ చేసుకోలేక పోవటంతో గూగుల్ సంస్థ యూనివర్సిటీ వెబ్‌సైట్ ను ఒక్కసారిగా రద్దు చేసి రాయలసీమ యూనివర్సిటీ అధికారులకు ఝలక్ ఇచ్చింది.రాష్ట్రంలోని యూనివర్సిటీల చరిత్రలో ఇలా యూనివర్సిటీ అధికారిక వెబ్సైటును గూగుల్ సంస్థ రద్దు చేయటం, యూనివర్సిటీ అధికారులు సకాలంలో రెన్యూవల్ చేసుకోలేదనే విమర్శలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. పీజీ సెట్ కౌన్సిలింగ్ , విద్యార్థుల పరీక్షలు, ఫలితాల విడుదల నేపథ్యంలో ఒక్కసారిగా యూనివర్సిటీ వెబ్‌పైట్ రద్దు కావడం పట్ల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్సిటీ ఉన్నతాధికారులు వెబ్‌సైట్‌ను రెన్యువల్ చేసుకోకపోవడం పట్ల ఉన్నత విద్యా మండలి అధికారులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా విద్యార్థి సంఘాలు తీసుకువెళ్లినట్లు తెలిసింది. యూనివర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం ఎటువంటి స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారు.

హెచ్‌ఎంఎ అసోసియేషన్ నూతన కార్యవర్గం

-అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వై.నారాయణ ,డిసి హుస్సేన్, కోశాధికారిగా రమేష్ నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్నూలు నగరంలోని హెచ్‌ఎంఎ భవన్‌లో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.



తైక్వాండో విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక భాస్కర్ నగర్ లోని చైతన్య స్కూల్ కే2 బ్రాంచ్ కి చెందిన విద్యార్థి నీలి షికారి ఎన్ ఎస్ మల్లిఖార్జునను చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న అభినందించి, విద్యార్థికి మెడల్, సర్టిఫికేట్ అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ చైతన్య స్కూల్ విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రాధాన్య ఇస్తున్నామని అన్నారు. చిన్నతనం నుంచే తైక్వాండోలో రాణించి బ్లాక్ బెల్ట్ సాధించి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఎన్‌ఎస్ మల్లికార్జున్ ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రాజేష్ , మాస్టర్ టి వెంకటేశ్వర్లు, మాస్టర్ అజయ్ పాల్గొన్నారు.

అవయవ దానంకు ముందుకు రావాలి

జిజిహెచ్‌లో జాతీయ అవయవదాన దినోత్సవం-ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



అవయవ దానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలనిఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కోరారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆదివారం 15వ భారతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా అంగ్‌దాన్ జీవన్ సంజీవని అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్య విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈరోజు జాతీయ అవయవదానం దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవయవదానం కోసం ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకొని అవయవదానం చేయడానికి ముందుకు రావాలని అన్నారు. అవయవ దానం వల్ల కొన్ని కుటుంబాలలో వెలుగునిస్తుందని అన్నారు.అవయవ దానం చేయండి ప్రాణదాతలు అవ్వండి అని అన్నారు. అందుకే అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదని అన్నారు. మనిషి మరణించిన తర్వాత దేహంమట్టిలో కలిసిపోతుంది, ఆ వ్యక్తి అవయవాలను అవసరమైన వారికి అమరిస్తే మరి కొంతమందికి జీవితానికి పునర్జన్మ లభిస్తుందని అన్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం వలన అపోహలు వల్ల చాలా మంది చనిపోతున్నారన్నారు. ఓ వ్యక్తి నుంచి అవయవాలు సేకరించి చేయడం వలన 8 మంది జీవితాలలో వెలుగు నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్‌శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్, సింధుసుబ్రహ్మణ్యం, యురాలజీ ఇంచార్జ్ ప్రొఫెసర్, డాక్టర్ ముత్యశ్రీ, నెఫ్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ వెంకటప్పకిరెడ్డి, హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ కిరణ్ కుమార్, ఇన్చార్జి ఎఆర్‌ఎంఒ డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల దోపిడీ

-పిపిఎస్‌ఎస్ సర్వేలో బయట పడ్డ వైనం

-4 యూనిట్లకు రూ. 362 కరెంటు బిల్లు..!

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అదాని స్మార్ట్ మీటర్ల బండారం పట్టణ పౌర సంక్షేమ సంఘం సర్వేలో బయటపడింది. విద్యుత్ భవన్ సమీపంలో 4 యూనిట్లు వాడుకున్న వినియోగదారునికి రూ.362 కరెంటు బిల్లు వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని పిపిఎస్‌ఎస్ యువ నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, మహమ్మద్ యూనుస్, పిపిఎస్ సీనియర్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సమావేశాలు ఆందోళనలు చేస్తుందని అన్నారు. ఆదివారం బళ్లారి చౌరస్తా కొత్త బస్టాండు ప్రాంతాలలో పిపిఎస్‌ఎస్ ప్రతినిధి బృందం పర్యటించింది. బాగా పనిచేసే పాత మీటర్ స్థానంలో స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని కొందరు ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వం అధానితో చేసుకున్న ఒప్పందాన్ని వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అమలు జరుపుతున్నారని ప్రశ్నించారు. అధికార ప్రతిపక్ష పార్టీలు అదాని దోపిడీ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడం వెంటనే నిలుపుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సర్వేకు పోయిన సందర్భంగా పిపిఎస్‌ఎస్ ప్రతినిధి బందాన్ని అభినందిస్తూ మా ఆందోళనకు ప్రచారానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీల అసోసియేషన్ ల ప్రతినిధులు జి. నారాయణ, ఎల్. నయూమ్ పాల్గొన్నారు.



-4 యూనిట్లకు రూ. 362 వచ్చిన కరెంటు బిల్లును చూపుతున్న ఇ.పుల్లారెడ్డి

మంత్రి భరత్ పుట్టినరోజు తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

మంత్రి టిజి భరత్ పుట్టిన రోజు సందర్భంగా నగరంలోనీ స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో తైక్వాండో పుంసే పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా 22వ వార్డు టిడిపి ఇంచార్జ్, న్యాయవాది ఎం. శ్రీధర్, 4వ వార్డ్ టిడిపి ఇన్చార్జ్ ఊట్ల రమేష్ బాబు, కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు హాజరై రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. న్యాయవాది శ్రీధర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో అన్ని రంగాల్లోనూ మంత్రి టీజీ భరత్ తన సేవలను అందిస్తున్నారని, స్పోర్ట్స్ లో కూడా వారి సహాయ సహకారాలు ఇస్తున్నారని చెప్పారు. 4వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ ఊట్ల రమేష్ బాబు జాతీయ స్థాయిలో పాల్గొని కర్నూలుకు తృతీయ స్థానాన్ని తీసుకొచ్చిన విద్యార్థిని టిఎం. హరిప్రియను సన్మానించి అభినందించారు. రాబోయే రోజుల్లో తైక్వాండో కోచ్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో కర్నూలుకు మెడల్స్ తీసుకురావాలని కోరారు.



సిఎస్ఐ బిషప్ గా రెవ సంతోష్ ప్రసన్న రావు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్



నంద్యాల అధ్యక్ష ఖండం బిషప్ గా కమనూరి సంతోష్ ప్రసన్న రావును సినాడ్ సభ్యులు ఎంపిక చేశారు. ఏప్రిల్ 2024 న జరిగిన బిషప్ ఎన్నికల్లో రెవ, సంతోష్ ప్రసన్న, రెవ. నందం ఐజాక్, రేవ. సాల్మన్, రేవ. ఐజాక్ ప్రసన్న కుమార్, నలుగురు పోటీ పడ్డారు. అప్పటి నుండి నేటి వరకు జాప్యం జరిగింది. సినాడ్ డయాసిస్‌లో మోడరేటర్ లేక పోవడంతో నంద్యాల బిషప్ ఎంపిక ఆలస్యమైంది. ఇటీవల మోడరేటర్ ఎన్నిక అనంతరం సినాడ్ సభ్యులు అంతా కలిసి సంతోష్ ప్రసన్నరావును నంద్యాల డయోసీస్ (డాన్) బిషప్‌గా ఎంపిక చేసారు. ఇదివరకు బిషప్‌గా ఉన్న పుష్పాలలిత గత ఏడాది రిటైర్ కావడంతో బిషప్ ఎంపిక అనివార్యం అయ్యింది. కమనూరి సంతోష్ ప్రసన్న రావు కడప జిల్లా కలసపాడు గ్రామ వాస్తవ్యులు. తండ్రి పురుషోతం ప్రభుత్వ స్కూల్ హెడ్ మాస్టర్ కాగా, తల్లి పెద్దిటీ పరిపూర్ణమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఐదు మంది ఆడపిల్లల కాగా సంతోష్ ఏకైక సంతానం. తల్లి చిన్న తనం నుండే ఆయనను భక్తి శ్రద్ధలతో పెంచింది. డిగ్రీ, బిఎడ్ పూర్తి చేసిన సంతోష్, తల్లి పరిపూర్ణమ్మ ప్రేరణతో హైద్రాబాద్ లోని బైబిల్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి పాస్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లా లోని ముద్దనూరు ఫాస్ట్రేట్‌లో డినరి చైర్మన్ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరి ఎంపిక పట్ల పాస్టర్లు , నంద్యాల డయాసిస్ చర్చి సభ్యులు హర్షం ప్రకటించారు. బాణా సంచాకాల్చి, మిఠాయిలు పంచుకున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్న కుమార్

మెరుగైన విద్యాబోధన అందించాలి

పిజిటీలకు శిక్షణ

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

కర్నూలు నగర శివారులోని ఓ ప్రైవేటు బిఇడి కళాశాలలో కేజీబీవీలో పనిచేస్తున్న ఇంగ్లీష్ సబ్జెక్ట్ పిజిటిలకు శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఎస్‌ఎ సంచాలకులు డాక్టర్ ప్రసన్నకుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ పై ఉన్న భయాందోళన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నంద్యాల జిసిడిఒలు స్నేహలత, 9 జిల్లాలకు చెందిన పిజిటిలు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎఐఎస్ఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు , ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను దగ్ధం చేస్తూ ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఎఐఎస్ఎఫ్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, డి. సోమన్న, ఎస్ షాబీర్ బాష లు మాట్లాడుతూ, విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, విద్యార్థులహక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని విమర్శించారు.



తరగతి గదిలో నిలువ ఉంచిన సిమెంట్ సంచులు

తరగతి గదిలో సిమెంట్ నిల్వలు

-బోధనకు తప్పని ఇబ్బందులు -క్రిష్ణదొడ్డి ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని కృష్ణదొడ్డి ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు కింద వచ్చిన సిమెంట్ సంచులు తరగతి గదిలోనే ఏళ్లుగా నిల్వలు చేశారు. దీంతో విద్యను బోదించుటకు అటు ఉపాధ్యాయులకు ఇటు బోధనందుకుంటున్న విద్యార్థులకు ఇబ్బందులుగా మారింది. వైసిపి ప్రభుత్వం నాడు నేడు కింద ఇదే పాఠశాలలో స్వల్ప పనులు చేపట్టారు. ఆ పనులు క్షేత్రస్థాయిలో జరగనందున అక్కడికి అవసర మైన సిమెంట్ సంచులు ఎక్కువ రోజులు నిల్వ చేయడంతో అవి గడ్డ కట్టి నిరూపయోగంగా మారాయి. అయితేనేం అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎక్కడికైనా తరలించాలని ఎంఇఒలకు పలు మార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మొదటికే ఆ పాఠశాలలో చిన్న చిన్న గదులు మూడు గదులు మాత్రమే ఉన్నాయి. ఒకటి నుండి ఐదు వరకు 123 మంది విద్యార్థులున్నారు. రెండు మూడు తరగతులకు మాత్రమే ఇక్కడి గదులు సరి పోవడం లేదు. గత్యంతరం లేక అంగన్వాడీ సమీపంలో మరొక గదిలో ఉంటున్నారు. ఒక ప్రక్క సిమెంట్ నిల్వలు, మరో ప్రక్క రేషన్ సంచులు వంటివి గదిలో స్థలం ఆక్రమించడం వలన ఇబ్బందిగా ఉందని ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మద్దికేర

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నూతన కమిటీ సభ్యులు మాదిగ జాతి అభివృద్ధికి కృషి చేయాలని ఎంఆర్‌పిఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు, సుభాష్‌చంద్ర, రెడ్డిపోగుభాస్కర్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన మద్దికేర డిపిఎపి హాలులో, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షునిగా గద్దల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, ప్రచార కార్యదర్శిగా పారానరేంద్ర, ఉపాధ్యక్షులు చంద్రమాదిగ, ఎంఎస్‌పి మండల అధ్యక్షుడు ఫొటోగ్రాఫర్ రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి రత్నమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆప్‌పిఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు తమ ఎంపికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ అడుగుజాడలలో రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మాదిగ జాతి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని ప్రమాణం చేశారు.

కూటమిలో రైతులకు అన్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కొత్తపల్లి

కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 76 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 47 లక్షల మంది రైతులకే జమ చేసి గొప్పలు చెప్పుకుంటుందన్నారు. 30 లక్షల మందికి మొండిచేయి చూపించినప్పటికీ రైతుల పక్షం అన్ని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలో నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ. 18వేలను ఆడబిడ్డ నీది కింద ప్రతి మహిళకు జమ చేస్తామని చెప్పి నేటికీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. రూ.20వేలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పినప్పటికీ అన్నదాత సుఖీభవ కేంద్రంతో కలిపి ఇరవై వేలు అని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రైతుల చుక్కల భూములకు ఈ ఫారం పట్టాలు, కౌలు రైతుల భూములకు కేంద్రంతో సంబంధం లేకుండా రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే స్మార్ట్ మీటర్లు అదానీకి లాభం చేకూర్చేలా ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నంద్యాల జిల్లా కార్యదర్శి ఎం సికిందర్, కొత్తపల్లి మండల అధ్యక్షులు అతవుల్లా, ఉపాధ్యక్షులు నాగన్న, మైనారిటీ అధ్యక్షులు శాలుఫైల్‌మాన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు యేసన్న ఉన్నారు.

సెప్టెంబర్ 15న ఛలో విజయవాడ

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని కల్లూరు లో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం సూర్యనారాయణ భవన్‌లో వార్డు నాయకులు జె శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఎపి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కె. సుధాకరప్ప మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు తమ బతుకులు బాగు లేకపోయినా అందమైన నగరాలు సృష్టించడంలో తమ చెమటను ధారపోస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఉదయం 6 గంటలకు వారి పని ప్రారంభమై రాత్రి 7 గంటల వరకు పనులు చేసుకున్నా కుటుంబం గడవడం చాలా కష్టంగా మారిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్ గ్యాస్ కరెంటు బస్సు చార్జీలు రైల్వే ఛార్జీలు తదితర భారాలు ప్రభుత్వాలు ప్రజల పైన వేయడం వలన కార్మికులు ఈ భారాలను భరించలేక పోతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకక దూరప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. సెప్టెంబర్ 15న విజయవాడలోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని చేయబోతున్నదని, ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని పదిమంది సభ్యులతో ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షులుగా మద్దిలేటి, కార్యదర్శిగా మునిస్వామి, గౌరవ అధ్యక్షులుగా రాబర్ట్, ఉపాధ్యక్షులుగా శేషన్న, సహాయ కార్యదర్శిగా ఆర్.రాము, కోశాధికారి ఎస్ రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న సుధాకరప్ప

హాస్టళ్లలో సిబ్బంది కొరతతో అవస్థలు

ప్రజాశక్తి-పత్తికొండ



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద విద్యార్థులను చదివించాలని ఉద్దేశంతో హాస్టలను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు కావలసిన సదుపాయాలు , సిబ్బంది నియమించడంలో పూర్తిగా విఫలం చెందిన సంఘటనలు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో చోటుచేసుకుంది. పత్తికొండ, ఆస్పరి, ఎరుకల చెరువు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్, వంట మనుషులు, కామాటి, వాచ్‌మెన్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తికొండలోని సరళీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ,400 విద్యార్థులను కలుపుకొని హాస్టలను ఏర్పాటు చేశారు. ఇందులో కేటగిరీల వారిగా వార్డెన్లను నియమించాలి. 400 మంది విద్యార్థులకు ఒక్క వార్డెన్, ఓట్ సోర్సింగ్ ద్వారా ఇద్దరు వంట మనుషులను నియమించారు. పత్తికొండ బాలికల హాస్టల్‌లోని వంట మనిషిని నియమించలేదు. ఆస్పరి బాలుర వసతి గృహానికి వార్డెన్‌తో పాటు కమాటి వంటలు మనిషి నియమించలేదు. ఎరుకల చెరువు బాలల వసతి గృహంలో వార్డెన్ లేరు. హాస్టళ్లకు సరైన సిబ్బంది లేకపోవడం విద్యార్థు లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డెన్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారని మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయంపై ఎఎస్‌బ్ల్యు ఒకె బాబును వివరణ కోరగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు హాస్టల్లో ఖాళీ పోస్టులను పంపించాం. జిల్లా అధికారుల ఆదేశాల మేరకే ప్రభుత్వ నిబంధన ప్రకారమే పోస్టులను భర్తీ చేస్తాం.

అభివృద్ధిపై తప్పుడు మాటలు సరికాదు : వైసిపి


ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం హుస్సేనాపురం గ్రామ సర్పంచి భర్త వెంకటేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సమక్షంలో శుక్రవారం వైసీపీ నుండి టిడిపిలో చేరి వైసిపిపై అబండాలు వేస్తే సహించేది లేదని వైసీపీ జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ, మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచి లక్ష్మీదేవి భర్త మొన్నటిదాకా వైసీపీలో బేతంచెర్ల మండలంలోని కాంట్రాక్టర్లలో ఎ-1 కాంట్రాక్టర్‌గా పేరు సంపాదించి దాదాపు రూ. 3కోట్ల కాంట్రాక్టు పనులు సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, బీటీ రోడ్లు తదితర చేపట్టి లక్షల రూపాయలు దండుకొని ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలో తమ గ్రామంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెంకటేశ్వర రెడ్డిపై ఓ కన్ను వేసి ఉంచాలని టిడిపి నాయకులకు సూచించారు. భవిష్యత్తులో వెంకటేశ్వర రెడ్డి లాంటి వాళ్ళు వైసిపిపై గానీ మా అధినాయకుడు మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై లేనిపోని మాటలు మాట్లాడితే నడిరోడ్డులో నిలబెట్టి నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బిఎల్‌ఒల గౌరవ వేతనాలు పెంపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో , ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే బిఎల్వోల గౌరవేతనాలను పెంచుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. బిఎల్‌ఒల గౌరవ వేతనం రూ 12 వేలు, బిఎల్‌ఒ సూపర్వైజర్ కు రూ 18వేలు, రిటర్నింగ్ ఆఫీసర్‌కు రూ.30వేలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు రూ.25వేలు గౌరవ వేతనాలను చెల్లించేందుకుగాను ఎన్నికల కమిషన్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.



సిజె దంపతులకు స్వామిఅమ్మవారి చిత్ర పటానిన అందజేస్తున్న ఇఒ శ్రీనివాసరావు

మల్లన్న సన్నిధిలో సిజె దంపతులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలంలో శ్రీస్వామి అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఇఒ శ్రీనివాసరావు, వేద పండితులు, అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచనం మండపంలో ఆశీర్వచనాలు పలికి స్వామి అమ్మవార్ల శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

శ్రీశైల క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం

ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీశైలం క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు, యాత్రికులు అధిక సంఖ్యలో శ్రీశైలానికి తరలి వచ్చారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయ కంపార్ట్మెంట్లు, క్యూలైన్‌లో దర్శనం కోసం బారులు తీరారు. క్యూలైన్లు యాత్రికులు, భక్తులతో కిక్కిరిరిశాయి.

పాఠశాలకు క్రీడా సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల : మిడ్ టౌన్ రోటరీ క్లబ్ నంద్యాల అధ్యక్షులు కేశవమూర్తి, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహానంది మండలం మసీదుపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జాకీర్ హుస్సేన్‌కి క్రీడా సామాగ్రిని ఆదివారం అందజేశారు. నంద్యాల పట్టణంలోని రోటరీ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యా వికాసానికి తమ క్లబ్ సభ్యులు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డివి సుబ్బయ్య, కాల్వ నాగరాజు, ప్రసాద్, రమేష్, శేషఫణి, అన్నెం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.